# ఆస్తి

## రామకృష్ణారెడ్డి



సావిత్రి పెళ్ళయి అయిదేళ్ళయింది. అందంగా బలంగా వుండే సావిత్రికీ, బక్కగా నల్లగా వుండే సిన్రామయ్యకూ పోలికే వుండదు.

అంతేగాదు, వాడు ఎర్రిబాగులోడని అందరికీ తెలుసు. "వాడు ఎర్రిబాగులోడైతే 'అచ్చి' ఎర్రి బాగుల్దా?" అని సావిత్రి పుట్టింటోళ్ళయిన ఉరుటూరోళ్ళు అనుకున్నారు. అందుకే యాభై వేల కట్నంతో, వీసెడు బంగారంతో సావిత్రి పెద రామయ్య కోడలుగా, సిన్రామయ్య భార్యగా ఆ ఇంటికి వచ్చింది. పెండ్లయిన రెండేండ్లకల్లా సావిత్రికి కొడుకు పుట్టినాడు. కొడుకు పుట్టిన ఆర్నెళ్ళకు, అత్తకు తేలుకుట్టి చచ్చిపోయింది. ఆ తర్వాత నెలకో రెన్నెళ్ళకో పెద రామయ్య తెల్లార్ఝా మున పేడకడిమీద అడుగేసి జారిపడి కాలు విరగ్గొట్టుకున్నాడు. పుత్తూరు వైద్యం చేయించినా మనిషి 'ఆసినెరువోడే' అయినాడు. ఎక్కువగా మంచం మీదనే వుండాల్సి వచ్చింది.

ఇట్లా కష్టాలు రావడంతో సావిత్రి జడిసి పోలేదు. అదివరకే బంగారమైతే, ఇప్పుడు పుటం బెట్టిన బంగారమయింది. 'సావిత్రమ్మ సంసారం బాగా నడుపుతాంది' అనితను వినేట్లు ఊళ్ళోవాళ్ళు అనేమాటలు ఇదివరకే ఆమెకు కొంత కైపెక్కిం చాయి. ఇప్పుడు కష్టాలొకటొకటే రావడం వల్ల ఇంకా కైపెక్కినట్లుంది. అంతా బావుండి, ఇంట్లో అందరూ పన్జేసేవాళ్ళూ తెలివైనోళ్ళూ అయితే ఇంగ తన గొప్పేముంది? ఈడుపడిన సంసారాన్ని ఇగ్గుకొచ్చి నెగ్గుకొచ్చిందే గొప్ప. పంట కళ్ళంలో నిలబడి పంట చూసుకున్నప్పుడూ, పొలంలో పైరు చూసుకున్నప్పుడూ సంతోషంతో గర్వంతో సావిత్రి గుండె కొట్టుకొనేది. ఇదంతా తనది! అంటే తన కొడుకుది. వాడు పెద్ద వాడయ్యేటప్పటికి ఇందులో ఏ మాత్రం తగ్గగూడదు. ఇంకా ఎక్కువ కావాల.

సావిత్రి పుట్టిన ఊళ్ళో తనకు తెలిసినవాళ్ళల్లో అంతా ఆస్తిమీద ప్రాణాలు పెట్టుకుని బ్రతికినవాళ్ళే. తన తండ్రికెన్నేళ్ళ నుంచో ఉబ్బసంజబ్బు, వొట్టి ఎముకల గూడు. జబ్బు ఎక్కువగా వున్నప్పుడు కూడా ఆస్పత్రికి పోవడానికొప్పుకోడు. 'లెక్కదండగ' అంటాడు. తనింటికాడ లేక పోతే పని కుంటు యితాది అంటాడు. మంచంలో నించీ దిగలేదు. పని వివరాలన్నీ కష్టంగా దగ్గుతూనే, ఊపిరి పెడుతూనే పేరు పేరునా పిల్చి, తిట్టి, తెలుసుకుంటాడు. ఆ ఇంట్లో వాళ్ళు పని పాటలుచేసుకోవడంలో కంటే, ఆ వివరాలు ఆయనకు చెప్పడంలోనే ఎక్కువ అలిసిపోతారు. అయినా సరే, అయన్నె వ్వరూ విసుక్కోరు. "రోగమొచ్చి నోడికి నీకెందుకు వివరాలన్నీ?" అనరు. అంత జబ్బులో వుండీ సంసారం మీద అంత 'సెర్ద' జూపుతున్నందుకు మెచ్చుకుంటారు.

వాళ్ళ నాయిన సంగతే కాక వాళ్ళ మేనత్త మంగమ్మ కూడా ఎప్పుడూ జ్ఞాపకమే సావిత్రికి. ఈ మధ్యనే చచ్చిపోయిందామె. "పాపం! ఆమె బతి కుంటే మొగున్నీ పిల్లల్నీ కూలికి పోనిచ్చేది కాదు. తనెన్ని బాధలైనా పడి సంసారాన్ని యీదిలో పన్నిచ్చేది కాదు" కూలికి పోయి బతకడమనేది సంసారం యీదిలో పన్నెట్టే కదా! అత్త, సంసా రాన్ని నడపడానికి అన్ని బాధలు పడుతున్నట్టు తనకు మెట్ట మెదటిసారి తెలిసే సరికి తనకు పదేళ్ళ వయస్సు. పావడాలు కట్టుకుంటోంది. పైట అవసరమింకా రాలేదు. ఆ రోజింకా పూర్తిగా తెల్లార్లేదు. మసక మసక చీకటుంది. ఊళ్ళో రైతు లంతా ఇత్తనాలకు పోతున్నారు కాబట్టి సందడిగా వుంది. కాండ్లు కట్టుకుంటూంటే చూస్తూ నిల బన్న తనతో "అత్తగారింట్లో ముల్లు గట్టె వుందేమో తీస.క.రాపో" అన్నాడు నాయిన. అప్పటికాయ నకు బుసదగ్గులేదు. సొంతం సేద్యానికి పోతుండె. మంగమ్మత్త ఇల్లు మూడు నాలుగిళ్ళావతల వుంది. అక్కడా వీధిలో కాండ్లు కట్టుకుంటున్నారు. తను లోపలి ఇంట్లోకి పోయింది. వంటింటి వాకిలి ధగ్గర అత్త చీరె కొంగు కనిపించింది. వాకిట్లో

నిలబడి లోపలికి చూసింది. అత్తగారి సేద్యగాడు కొండన్నా, అత్తా దగ్గరిగా నిలబడి మాట్లాడుకుంటున్నారు. అత్త కొంగు కొండన్న చేతిలో వుంది! తనను చూసి దూరంగా జరిగినారు. తనెందుకొచ్చిందో చెప్పింది. "కొండన్నా! ములుగట్టె అంట యీ సాయిత్రికి" అంది అత్త. అప్పడత్త మామూలు గానే వుంది. కొండన్నా మామూలుగానేవున్నాడు. అయితే, కొండన్న అత్త కొంగుపట్టుకునుండడమే మామూలుగా వున్నెట్టు లేదు.

ఆ సంగతి అమ్మకు చెబితే, ఆమె ముందు అన్నీ వివరంగా అడిగి తెలుసుకుని, ఆ తర్వాత కోపగించుకున్నెట్టు "ఎవర్తోనన్నా అనేవు" అని హెచ్చరించింది. ముందు అడగడమెందుకో, ఆ తర్వాత కోపగించుకోవడమెందుకో అర్థం కాలేదు. కొండన్న అత్త కొంగుపట్టుకోవడం తప్పో కాదో అప్పటికి తెలీదు గానీ, అమ్మ ఆ రకంగా అడిగి కోపగించుకున్న తర్వాత అందులో ఏదో తప్పు వుందనిపించింది. ఏ రకం తప్పో తెలీదు. ఆ సంగతి కొంచెం కొంచెం మరచి పోతుండగా, ఓ రోజు 'దీపాలయాల'ప్పడు అమ్మ తొందర తొందరగా అత్తింటికి పోతూ కనిపించింది. ఎన్నెల్లో'ముక్కులు గిల్లే ఆట' ఆడుతున్న తను అమ్మ వద్దంటున్నా వినకుండా వెంటబడి పోయింది. అత్త మంచంలో పడుకునుంది. తలంతా విరబోసుకునుంది. భయపెట్టే దయ్యాల మాదిరిగాకుండా పాప మనిపించే దయ్యం మాదిరుంది. భుజాల మీదా, మోచేతుల మీదా ఉడకబెట్టిన పసుపు రాసుకునుంది. ఒక కన్ను ఉబ్బి వుంది, కొంచెం పైన చర్మం చీలి నెత్తురు చార కట్టింది. అత్త ఇట్లా ఎందుకయిందో అర్థం కాలేదు.

"సంసారం సంగతి పట్టిచ్చుకోడు. ఎంత సేపూ తాగడం, ఆడడం! నలుగురు పిల్లలుండారు. ఆ రొంత అచ్చీ పాడు జేసుకుంటే మల్ల ఏబాయిలో దూకాల? నా సావునేను సచ్చి సంసారం యీడు పడకుండా ఇగ్గకొస్తాంటే యీ అవమానాలూ అనుమానాలూ పైగా! యీ ముదనష్టపోడు సావన్నా సస్తే ఆ రొంతా మిగుల్తుంది. లేకపోతే నా పిల్లలకు సిప్పలే గతి... సిప్పలే... తల్లో అంటూ రాగం తీసి ఏడ్చింది. తనకు నవ్వురావలసింది రాలేదు. అత్త ఏడుపునిజం ఏడుపే. అందుకే తనకు 'నగురాలేదు'. అత్తనెవరు కొడతారు? మామ కొట్టాల. పెండ్లాలనుమొ గుళ్ళు కొట్టడం మామూలే. దాన్ని పెండ్లాలుకూడా అంతగా పట్టించుకోరు. అత్త కూడా మామ కొట్టినందుకు సావాలనడం లేదు. "ఆ రొంతా మిగలడానికి" సావాలంటోంది! పెండ్లాల కంటే,మొ గుళ్ళ కంటే వాళ్ళ బతుకుల కంటే రొంత అచ్చి ముఖ్యమైందని ఆ వయస్సులోనే సావిత్రికి చాలా బలంగా అర్థమయింది.

దుబ్బ నాయన్ను తల్చుకుంటే ఇంగా తమాషాగా వుంటుంది. ఆయన పేరు లింగారెడ్డి. ఊళ్ళో 'చిల్లర' జనం మాత్రమే ఆయప్పను ఆ పేరుతో పిలుస్తారు. మిగతావాళ్ళు చాటుగా అయితే 'దుబ్బోడు' అంటారు. ఆస్తి 'శానావుంది'. అయితే, ఆయప్పకు ఏపనీ వుండదు. తెల్లారి లేచింది మొదలు రాత్రి పండుకునేదాకా ఊరంతా తిరుగుతాడు. అందరిండ్లలో జరిగే సంగతులూ అందరిండ్లలోనూ చెప్తతాడు. పెండ్లాన్ని ముద్దుగా 'లంజముండ' అని పిల్చుకుంటాడు."మా లంజముండ ఏ పనిసేసినా శానా మైనంగా సేస్తాదిలే" అని గొప్పగా చెప్పకుంటాడు. "ఇంట్లో పనేగాదు సేలో పనైనా సరే సెండి పారేస్తాది" అని మెచ్చుకుంటాడు. వాళ్ళిద్దరికీ ఆడపిల్లలూ మొ గపిల్లలూ ఏడెనిమిది మందిదాకా పుట్టినారు. ఆమెను గురించి ఊళ్ళో అంతా ఒక రకంగా చెప్పకుంటారు.ఆమె సేద్యగాళ్ళతో సంబంధం పెట్టుకోడం మొగుని క్కూడా తెలుసుననీ, అసలా పిల్లోళ్ళు మొగునికి పుట్నోళ్ళు కాదనీ కూడా చెప్పకుంటారు.

ఒకసారి రంగమ్మ అన్నమాటలు ఇప్పటికీ జ్ఞాప



కమున్నాయి. దుబ్బ నాయిన వచ్చి మామూలుగా వాళ్ళ 'లంజముండ' సంగతులు చెప్పిపోతూనే రంగమ్మ వచ్చింది మజ్జిక్కి. రంగమ్మ ఆడవాళ్ళ దగ్గరా మగవాళ్ళ దగ్గరా బూతులు మాట్లాడుతుంది. ఒక్కోసారి ఆమె మాట్లాడే బూతుల్ని మగవాళ్ళు కూడా విన్లేక "ఏం అద్దానివే నీయమ్మ..." అని బూత్తోనే మెచ్చుకుంటారు. (లేదా, అసహ్యించుకుంటారు). అప్పుడెవరు తెచ్చినారో జ్ఞాపకం లేదు దుబ్బనాయిన భార్య సంగతి. రంగమ్మ అందుకుంది. "అంటారబ్బా... ఆ సంగతి ఆమెకు తెలాల, మనకేం తెల్సు? అయినా యాడికితప్పో, యాడికి ఒప్పోలే! ఈ ముండా కొడుక్కు అక్కర్లేంది ఏ ముండా కొడుకు మొగాన్నో పారేసిసంసారం నడుపుతాంది. శీలం పెరుక్కుని సిత్తిలో దాసి పెట్టుకుంటే ఏం లాభం? సంసారం నడ్సేది సూడాలగానీ ..."

"పేద్యగాళ్ళత్తో పని సేయిచ్చుకోడానికి ఆ పనే సేయాల్నా? జీతం సాల్దా?" అంది సూరంపిన్ని.

"ఈ ఊళ్ళో ఎంత మందిని సూపిచ్చమంటావు?" అని రంగవ్మ సవాలుకు దిగింది. "ఏమోలే తల్లీ నాకెందుకు" అని సూరంపిన్ని ఓడిపోయింది.

దుబ్బనాయిన భార్యను గురించి ఊళ్ళో అట్లా మాట్లాడుకుంటున్నా ఆమె గౌరవం తగ్గిందేమీ లేదు. ఆమె కొడుకులకూ కూతుళ్ళకూ పెద్ద పెద్ద ఆస్తి కలిగిన సంబంధాలే వచ్చినాయి. సంసారాన్ని పైకి తెచ్చిన మనిషిగా ఆమెకు పేరొచ్చింది.

"ఆమెకట్లా జరిగిందా ఇంగ గురమ్మ సంగతి అందుకు 'ఇరుద్ధం'గా జరిగింది మల్లా" గురమ్మ ఎంత సక్కటి మనిషి! అట్లాటామె 'దరిద్రం మొకంది' అయింది. ఆమె వచ్చిన కాన్నించీ అత్తిల్లు అణగారిపోయిందంట. మొగుడు ఎప్పుడూ తిడుతూ కొడుతూ వుండేవాడు. గురమ్మ నడవడికను ఏ రకంగానూ ఎవరూ తప్పుపట్లేరు. "మంచిదే, అయితేంటికి? దరిద్రంది" అంటారు. ఆఖరుకి, ఆమె పనికొస్తే పనికుంటయితాదని నమ్మేకాడికొచ్చినారు!

* * *

దూడ సచ్చిపోయినప్పట్నుంచీ కోరుకొమ్ముల ఎనుము సరిగా పాలివ్వడం లేదు. పొదుగులో చెయ్యి పెడితే ఎగిసి పడుతోంది. పాలు పిండాలని పట్టుపట్టింది సావిత్రి. ముందు సెలకోల పట్టుకొని నిలబడినాడు సెన్నయ్య. సావిత్రి రెండు మోకాళ్ళ మధ్య పెద్ద చెంబు పెట్టుకుని ఎనుము పొదుగు దగ్గర గొంతుక్కూచుంది. మోకాళ్ళు దాటి తొడలు కనిపించేట్టు చీరె పైకి లాక్కుంది. పచ్చగా, బలంగా వున్న ఆ తొడలకేసి చూడకుండా వుండలేక, చూడలేక, చెన్నయ్య తల తిప్పకుని ఎనుము కొమ్ముల మధ్య గీరుతూ వుండిపోయినా.

పెదరామయ్య సిన్నప్పట్నించీ 'సేరదీసినాడని జీతం ఎంతిచ్చినా సేస్తూ వచ్చినాడు సెన్నయ్య. సెన్నయ్య అట్టాంటి జీతగాడు తక్కువ జీతమైనా ఆ ఇంట్లోనే సేస్తూ వుండడం ఊళ్ళో వాళ్ళకు కన్నెర్రయింది. సెన్నయ్య మీద వలలు విసరడం మొదలయి, బాగా ఎక్కువయింది. సెన్నయ్య కూడా యీ మధ్య ఆ వత్తిళ్ళకు మెత్తబడిపోతున్నాడు. ఆ సంగతి సావిత్రి కనిపెట్టింది. ఆ సంగతి కంటే ముందే తన సంసారం అంతకంతకూ పెరుగుతా రావాల్నంటే సెన్నయ్యట్టాటి జీతగాన్ని పోగొట్టుకోకూడదనీ తెలుసుకుంది. ఊళ్ళో వాళ్ళ వలల్లో సెన్నయ్యను పడనీకుండా వుంచాలంటే తను అంత కంటే బలమైన వల వెయ్యాలనీ అనుభవ జ్ఞానం ద్వారా గ్రహించింది.

పసులకాడ పండుకున్న సెన్నయ్యకు నిద్ర పట్టలేదు. కనురెప్పల కింద పచ్చగా బలంగా మెత్తగా వొత్తుకుంటున్న తొడలు! సావిత్రమ్మలో ఏదో మార్పు కనిపిస్తోంది. ఆ మార్పు తనకు ఇష్టమున్నేట్టూ వుంది, ఇష్టం లేనట్టూ వుంది. ఏదో గుబులు గుబులుగా వుంది. ఆమె కావాలనే అట్టా సేస్తోందా? ఎందుకు సేస్తుంది? ఆమెకేం తక్కువ? మొగుడు రోంత తిక్కలోడే అనుకో. కొడుకు పుట్నాడు, ఇన్నాళ్ళా బాగానే వుందిగా. ఇట్లా ఆలోచిస్తున్నప్పుడే సెన్నయ్యకు పుల్లయ్య జ్ఞాపకం వచ్చినాడు. ఒకసారి ఆమని కాలంలో పుల్లయ్యతో పరిచయమయింది. వాళ్ళ ఊరు యప్పిరాలంట. తెల్లార్జామున బండ్లో పొలానికి పోయేటప్పుడు ఏమిటేమిటో చెప్పేవాడు.

పుల్లయ్య అంతకు ముందు వాళ్ళ ఊళ్ళో ఒక రెడ్డింట్లో జీతానికుండేవాడంట. ఆ రెడ్డికి నూరెకరాలకు పైగా భూముండట. కొడుకులకూ, కూతుళ్ళకూ పెండ్లిండ్లయినాయి. గొప్ప 'గౌరవమానమైన కుటుంబం.' ఆ రెడ్డి పెండ్లాం ఒక రాత్రి వచ్చి యీని పక్కలో పండుకుందట! యాడనో యప్పిరాల్లో జరిగిన సంగతి యీడనే జరిగినంత రహస్యంగా చెప్పినాడు పుల్లయ్య. తను నమ్మలేదు. వాడు అంత రహస్యంగా తన మనసులో వున్న సంగతి అప్పుడే బయట పెడుతున్నట్టు చెప్పడం చూస్తే అబద్ధమనీ అనిపించలేదు. అంత పెద్దింటామె జీతగాడి దగ్గరికే రావాల్నా? అట్లగాదంట. ఆమె అట్లా పని అంతకు ముందు నుంచే చేసేదంట. "పాపమేమో పున్నెమేమో గానీ అన్నా! ఆమె అట్లా సేసేది ఆమె మొగునిక్కూడా తెల్సునంట" ఈ మాట ఇంకా చిన్నగా, అతి రహస్యంగా చెప్పినాడు పుల్లయ్య.

"ఇంగూరుకో సెప్పేవానికి బుద్ధి లేకపోతే యినే వానికన్నా వుండాల"

"ఏమో అన్నా, నాకేం తెల్సు? యిన్నేది సెప్పినా"

"మల్లా...అప్పుడు నువేం జేసినావో సెప్పలేదు" అన్నాడు బక్కోడు. వానికి పదారూ, పదేడేండ్లుంటాయి. నొగల్లో కూకుని బండి తోల్తున్నాడు. వాడిన్లేదనుకుంటే, ఇనడమేకాక వానిక్కావల్సిన 'సెక్స్' కాడపట్టుకున్నాడు బక్కోడు.

"ఏంజేసేదీ? ఆ తల్లికి దండం బెట్టి అప్పటికి తప్పిచ్చుకోని...పొద్దున్నే సెప్పాసెయ్యకుండా లగో...లగు"

"మీ అమ్మా నాయినా పుల్లయ్యని నీ పేరు బాగా పెట్నారే! నేనైతేనా..." అన్నాడు మల్లా బక్కోడు. "ఊరుకోరా...బక్కనాకొడక!" అని ఇద్దరూ తిట్టినారు. "యాడన్నా! కొంచెమెచ్చుతక్కువగా మాయమ్మ తోడ్డి" అన్నాడు పుల్లయ్య దిగులుపడుతున్నట్టుగా. ఆ దిగులు ఆమె అట్లా చేసినందుకో, అమ్మతోడైనందుకో తెలీదు. బక్కోడు అది కూడా పట్టుకున్నాడు.

"ఒర్నీ! సిన్నదయ్యుంటే సెయ్యి సేసుకునేవాడివేసను" అన్నాడు కిసకిసా నవ్వుతూ. సెన్నయ్య వాన్ని మళ్ళీ తిట్టినాడుకానీ నవ్వకుండా వుండలేకపోయినాడు. "సిన్నదయ్యుంటే ఏమయ్యేదోలే..." అన్నాడు పుల్లయ్య గూడా నవ్వుతూ.

అట్లా ఆలోచనల్లోనే సెన్నయ్య నిద్రలో పడిపోయినాడు. సెన్నయ్య మంచం దగ్గరికొచ్చి కూర్చోబోయిన సావిత్రి మళ్ళా కొంచెం సంకోచంతో ఆగిపోయింది. దుబ్బనాయన పెండ్లాన్ని అన్నట్టే తననూ అంటారేమో! సెన్నయ్యే యీ సంగతి ఎవ్వరికన్నా సెప్పడనేమిటి? అనుకుంది. ఆస్తి కోసం సర్వస్వం ధారపోసి పొగడ్తలందుకున్న ఆడవాళ్ళు "మమ్మల్ని చూడు, మొగుళ్ళ కొడుకుల ఆస్తి కోసం ఎన్నెన్ని కష్టాలు పడినామో, ఎంతెంత త్యాగాలు చేసినామో" అంటున్నట్టుంది. దుబ్బనాయన పెండ్లాన్ని గురించి సాటుగా ఎగతాళిగా మాట్లాడుకునేవాళ్ళు. నిజమే. అయితే వాళ్ళే ఆమె మొగుని ఆస్తిని పెంచినందుకు పొగిడే వాళ్ళు కదా! సినామయ్య భార్య సెడకుండా బతికిందని ఎవరూ సెప్పకోరు. సంసారాన్ని సెడగొడితే సెప్పకుంటారు, పైకి లెస్తే సెప్పకుంటారు.

సావిత్రిలో అనుమానాలు తీరిపోయినాయి. ఆస్తి అనే అగ్ని గుండాన్ని ప్రజ్వలింపజేయడానికి బ్రతుకు సమిధల్ని అర్పించిన ఆడవాళ్ళ వరుసలో సావిత్రి కూడా ఒకరయింది.

* * *

*అసహ్యాన్నీ, జుగుప్సనీ కలిగించే యీ కథని అప్పటి సావిత్రి నుంచీ ఇప్పటి ఆధునిక స్త్రీ దాకా పొడిగించవచ్చు. కాకపోతే, అప్పటి 'ఆస్తి' ఇప్పుడు 'హోదా' అయుండొచ్చు. ఆడది మగవాడి ఆస్తిలో ఆస్తిగా, తను నాస్తిగా వున్నంత కాలమూ ఇలాంటి కథల్లో అప్పటికీ, ఇప్పటికీ తేడా ఏముంటుంది?*

* * *

■ రచనాకాలం 1976. అముద్రితం.